# సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024





### ఇక స్మార్ట్‌గా జహీరాబాద్

జహీరాబాద్ పట్టణ ప్రాంతానికి మహర్దశ రానుంది. కేంద్రం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ప్రకటించడంతో భారీగా విస్తరించనుంది.

వివరాలు 8లో ▸



### వైద్య పరిశోధనలకు ..

వైద్య పరిశోధనలకు మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ వేదికగా ఉపయోగపడుతుందని మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్ అన్నారు.

వివరాలు 8లో ▸

### సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ఆశ్రిత్



సిద్దిపేటజోన్: సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా ఆశ్రిత్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్‌గా కొనసాగుతున్న ఆశ్రిత్ కుమార్‌ను ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇతనికి సుడా వైస్ చైర్మన్ గా అదనపు బాధ్యతలు సైతం అప్పగించారు.

## విషజ్వరాలపై రేపు 'సాక్షి' ఫోన్ ఇన్..

జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణాల్లో వైరల్ ఫీవర్, డెంగీ, చికున్‌గున్యా, మలేరియా తదితర జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు సంబంధించి శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. డెంగీతో పాటు ఇతర జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌బాబ్జీ వివరిస్తారు.





తేదీ : 31-08-2024

సమయం : ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
**98669 84788, 98668 98692**

## ఆస్పత్రిలో కంపు.. రోగాల 'డంపు'





ఈ చిత్రం చూస్తే ఇదేదో డంప్ యార్డు అనుకుంటున్నారా? కాదండీ బాబూ.. ఆస్పత్రిలో రోగుల మధ్య ఏర్పాటు చేసిన చెత్తకుప్ప. అసలే విషజ్వరాలతో జనం అల్లాడుతుంటే.. ఇవేవీ పట్టనట్లు వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనం. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రెండో అంతస్తులో రోగుల వార్డు దగ్గర మెడికల్ వ్యర్థాలు తదితర వాటిని అక్కడే పడేసి డంప్ యార్డ్‌గా మార్చారు. ఇది చూసిన రోగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జబ్బుతో చికిత్స కోసం వస్తే ఇక్కడ మరో రోగం అంటుకునే ప్రమాదం ఉందని వాపోతున్నారు. సాక్షాత్తు జిల్లా కేంద్రంలోనే ఈ దుస్థితి నెలకొనడం గమనార్హం.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

# డెంగీ బూచి.. రోగులను దోచి!



**ప్రైవేటు ఆస్పత్రుల ఇష్టారాజ్యం**
- ర్యాపిడ్ కిట్లతోనే రోగ నిర్ధారణ
- కానరాని ఎలీసా టెస్ట్‌లు
- ప్లేట్లెట్లు తగ్గాయంటూ భయపెట్టి.. అధిక ఫీజు వసూలు
- ఇబ్బందుల్లో రోగులు
- పట్టించుకోని జిల్లా వైద్యారోగ్య శాఖ



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లాలో ఒకవైపు సీజన్ వ్యాధులు విజృంభిస్తుంటే మరోవైపు ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ దందా యథేచ్ఛగా సాగుతోంది. జ్వరమని వెళ్తే చాలు.. ప్లేట్లెట్లు తగ్గాయని, డెంగీ ఉండొచ్చంటూ భయపెడుతున్నారు. రకరకాల వైద్య పరీక్షలు చేయించడంతో పాటు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని వేలాది రూపాయలు దండుకుంటున్నారు. సుమారు నెల రోజులుగా కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా విష జ్వరాలు ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితిని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు సొమ్ము చేసుకుంటున్నాయి. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం. – సాక్షి, సిద్దిపేట

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో చాలా మంది జ్వరాలతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇదే అదనుగా భావించి డెంగీ టెస్టులు, చికిత్స పేరుతో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో వచ్చిన పేషెంట్ల నుంచి రూ.వేలల్లో డబ్బులు లాగుతున్నారు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ చేసేందుకు అనుమతులు లేనప్పటికీ పేషెంట్‌కు అవసరమున్నా లేకున్నా ర్యాపిడ్ టెస్టులు(ఎన్ఎస్-1) చేస్తున్నారు. డెంగీని ఎలిసా టెస్ట్ ద్వారానే నిర్ధారించాలి. ఎలిసా టెస్ట్ సిద్దిపేటలోని టీ హబ్‌లో ఉంది. ప్రైవేట్ ల్యాబ్‌లలో ఉన్న దాఖలాలు లేవు. కానీ కేవలం ర్యాపిడ్ కిట్ల ద్వారానే డెంగీగా తేల్చేస్తున్నారు.

**రూ.వేలల్లో బిల్లులు**

ప్రైవేట్ ఆస్పత్రిలోని ల్యాబ్‌లోనే ర్యాపిడ్ టెస్ట్‌లు చేస్తూ రోగులను భయపెడుతున్నారు. తెల్లరక్త కణాలు తగ్గుతున్నాయని రిపోర్టు వస్తే చాలు.. మూడు నాలుగు రోజులు అడ్మిట్ కావాలని చెబుతున్నారు. అడ్మిట్ అయితే ఇక బెడ్, నర్సింగ్, డాక్టర్ విజిటింగ్, టెస్ట్ చార్జీల పేరుతో రూ.వేలల్లో బిల్లులు వేస్తున్నారు. లేదంటే క్యాజువాలిటీలోనే ట్రీట్‌మెంట్ పేరుతో హడావుడి చేస్తూ పూటకోసారి పలు రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు. టెస్ట్‌లు కాకుండానే రోజుకు రూ.6 వేల నుంచి రూ.8వేలు వసూలు చేస్తుండటం గమనార్హం.

**ప్రైవేట్‌లో నమోదు కానీ డెంగీ కేసులు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలిసా టెస్ట్ ద్వారానే డెంగీని నిర్ధారించాలి. ర్యాపిడ్ టెస్ట్ ద్వారా నిర్ధారించ వద్దని వైద్యారోగ్య శాఖ తెలిపింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటి వరకు 54 కేసులు మాత్రమే డెంగీ కేసులు నమోదు అయ్యాయ అని అధికారుల లెక్కలు చెప్పుతున్నాయి. వైరల్ ఫీవర్ ఉన్న వారికి ర్యాపిడ్ కిట్ ద్వారా టెస్ట్ చేస్తే పాజిటివ్ వచ్చే అవకాశం ఉంది. పేషెంట్‌కు డెంగీ అని చెప్పి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. అయితే ప్రభుత్వానికి ఇచ్చే సమాచారంలో మాత్రం లేవని పేర్కొంటుండటం గమనార్హం. జిల్లా వైద్యారోగ్య శాఖకు జిల్లా అధికారిగా ఎవరు? అని ఇప్పటి వరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ తేల్చకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రుల పై పర్యవేక్షణ కరువైంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

**మా దృష్టికి రాలేదు..**

ప్రైవేట్ ఆస్పత్రులలో ఫీజులు వసూళ్ల గురించి మా దృష్టికి రాలేదు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎలిసా టెస్ట్ ద్వారానే డెంగీని నిర్ధారించాలి. ర్యాపిడ్ టెస్ట్‌తో నిర్ధారించవద్దు. అలా అయితే చర్యలకు సిఫార్స్ చేస్తాం.

– వినోద్ బాబ్జీ, ప్రోగ్రాం ఆఫీసర్,

## జాతీయ స్థాయిలో ఆడితే రూ.లక్ష

**రాష్ట్ర స్థాయిలో రూ.50వేలు**
- విద్యార్థులూ ఆటల్లోనూ సత్తా చాటండి
- మంత్రి పొన్నం ప్రభాకర్



కబడ్డీ ఆడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఆటల్లోనూ సత్తాచాటాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను సన్మానించారు. విద్యార్థులతో కలిసి కబడ్డీ, వాలీబాల్ ఆడారు. అనంతరం పొన్నం మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికై ఆడితే ఒక్కో విద్యార్థికి రూ.50వేలు, జాతీయ స్థాయిలో ఆడితే రూ.లక్ష ఇస్తానని మంత్రి ప్రకటించారు. నియోజకవర్గంలో వ్యాయామ ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్న చోట భర్తీ చేయాలన్నారు. పోటీ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. హుస్నాబాద్‌లో ఉన్న మినీ స్టేడియంలో విద్యార్థులు ఆటలు ఆడుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం కేజీఆర్ గార్డెన్‌లో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లావుడ్యా కిషన్ నాయక్ పదవీ విరమణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాలల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం**

హుస్నాబాద్‌రూరల్: పాఠశాలల బలోపేతంతోపాటు ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి పొన్నం అన్నారు. గురువారం పోతారం(ఎస్)లో జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలల బలోపేతం చేయడానికి రూ.11వేల కోట్లతో 25 వేల పాఠశాలలో మౌలిక వసతులను కల్పించామని అన్నారు. శిశు కేంద్రీకృత విద్యా బోధన చేయడానికి ఉపాధ్యాయులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి వందశాతం సీడీపీ నిధులను వినియోగిస్తానని, సమస్యలను ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. ప్రతి పాఠశాలకు తాగునీరు సరఫరా చేస్తామని, ప్రతి గురుకులంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాలలు, కాలేజీలు, గురుకులాల్లో సమస్యలు ఉంటే తనకు నివేదించాలన్నారు.

### తీజ్ వేడుకల్లో మంత్రి

హుస్నాబాద్: అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తెచ్చిన రిజర్వేషన్లతోనే గిరిజనులు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారని మంత్రి పొన్నం అన్నారు. గురువారం హుస్నాబాద్‌లో గిరిజనులు నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. గిరిజన మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన తండాల్లో సౌకర్యాలు లేక విద్యకు దూరంగా ఉన్న వారికి విద్యను అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పాడి పంటలతో రైతులు సుభిక్షంగా, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తదితరులు ఉన్నారు.



గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి పొన్నం

## న్యూస్‌రీల్

### చెరువుల పరిశీలన

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు చెరువులు, కుంటలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్‌లోని కొత్తకుంటను సదర్శించారు. అనంతరం ఆర్ఐ కృష్ణ మాట్లాడుతూ ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలను సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తమ పరిశీలనలో వెల్లడైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ శ్రీకాంత్, సర్వేయర్ సిద్దార్థ్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

### 'పాత పెన్షన్' కోసం అవిశ్రాంత పోరాటం



ఉద్యోగ జేఏసీ సమావేశంలో ప్రతినిధులు

సిద్దిపేటజోన్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త పెన్షన్ విధానం రద్దుతో పాటు పాత పెన్షన్ విధానం వచ్చేవరకు అవిశ్రాంతంగా పోరాటం చేద్దామని ఉద్యోగ జేఏసీ జిల్లా ప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి పట్టణ విధుల్లో ర్యాలీ చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అశ్వాక్, నగేష్, చక్రధర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సిద్దిపేటరూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్ సూచించారు. పాఠశాలల్లో వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ప్రతి రెసిడెన్షియల్ స్కూళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సంక్షేమ హాస్టళ్లల్లోని వంటగదులను పరిశీలించి కూరగాయలు, పండ్లు, బియ్యం, పప్పు దినుసుల నాణ్యతను పరిశీలించాలన్నారు. అదేవిధంగా వైద్య అధికారులు పాఠశాలలను సందర్శించి డ్రైడే చేపట్టాలన్నారు. అలాగే విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి విష జ్వరాలు రాకుండా నివారించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, డీపీఓ దేవకీదేవి, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

### పాఠశాల భవనాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ హైస్కూల్ పాత భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు. గురువారం పాత భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనం మరమ్మతులకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

## కుల వివక్షను వీడాలి

- ఐకమత్యంగా ఉండాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సహపంక్తి భోజనం చేస్తున్న గ్రామస్తులు, అధికారులు

మర్కూక్(గజ్వేల్): కుల వివక్షను వీడి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఇటీవల శివారు వెంకటాపూర్‌లో బోనాల పండుగ సందర్భంగా దళితులను దేవాలయంలోకి నిరాకరించారని, దళితుల ఫిర్యాదు మేరకు గురువారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా ఆయన హాజరై మాట్లాడారు. 78 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో ఇప్పటికీ కుల వివక్ష ఉండడం బాధాకరమన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతి పండుగలోనూ అన్ని కులాలు పాల్గొని నిర్వహించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని ఎల్లమ్మ, మాతమ్మ గుడి వద్ద దళితులతో ప్రవేశం చేయించి కొబ్బరి కాయలు కొట్టించారు. అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్‌డీఓ బాన్సిలాల్, ఏసీపీ పురుషోత్తం, సీఐ మేందర్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్, తహసీల్దార్ ఆరిఫా, డీబీ ఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు

## నేడు టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

సిద్దిపేటజోన్: జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడాకారుల ఎంపిక ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 10 గంటలకు సబ్ జూనియర్ అండర్ 14 విభాగంలో బాలురు, బాలికల జిల్లా జట్ల కోసం సెలక్షన్ ఉంటుందన్నారు. ఎంపిక అయిన వారు వచ్చే నెల 1 నుంచి 3 వరకు ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకానునట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 94400 36878, 93933 81627 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## అన్ని రంగాల్లో రాణించాలి

**కలెక్టర్ మనుచౌదరి**



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు క్రీడా రంగంతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి కోరారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలను గురువారం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. మన ఊరు మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో కల్పించిన మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 2కె రన్, వ్యాస రచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో విద్యార్థులు రాణించేలా కృషి చేసిన పాఠశాల పీఈటీ తోట వెంకట్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి కావాల్సిన మౌలిక వసతులను సమకూర్చే విధంగా ఉపాధ్యాయులు పాటు పడాలని కోరారు. అనంతరం మిరుదొడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధనపై టీచర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఓ రామస్వామి, భూంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, కిషన్, టీచర్లు శ్రీనివాస్, రాజేశ్వరి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్జీటీలు ఏకం కావాలి

**ఎస్జీటీ యూనియన్ నేతల పిలుపు**



ఎస్జీటీయూ కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో మధుసూదన్‌రావు, రాష్ట్ర నాయకులు

వర్గల్(గజ్వేల్): దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న సెకండరీగ్రేడ్ టీచర్లు అందరూ తమ సమస్యల పరిష్కారం కోసం ఏకతాటిపైకి రావాలని ఎస్జీటీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధుసూదన్ రావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం పిలుపునిచ్చారు. గురువారం వర్గల్ మండలం గౌరారం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎస్జీటీ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎం పోస్టు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేతన వ్యత్యాసం సరి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరామ్ శ్రీనివాస్, వేణు, నాయకులు మల్లికార్జున్, శ్రీధర్‌రెడ్డి, అశోక్, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్ పర్యవేక్షణలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి
- గజ్వేల్‌లోని ఐఓసీ ఎదుట ధర్నా




ఐఓసీ ఎదుట ధర్నా చేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

గజ్వేల్ రూరల్: విద్యారంగ సమస్యలను తక్షణం పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు గురువారం వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు భారీ ర్యాలీగా పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వద్దకు చేరుకొని ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ డీఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.8వేల కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని, ఇవి విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా పెండింగ్ బకాయిలను విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నదన్నారు. ముఖ్యమంత్రే స్వయంగా విద్యాశాఖను చూస్తున్నప్పటికీ ఈ దుస్థితి నెలకొనడం సిగ్గుచేటన్నారు. కళాశాలల్లో ఫీజులు కడితేనే సర్టిఫికెట్లను ఇస్తామని తెలపడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, మధు, రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జేఎల్ ప్రమోషన్‌లు ఇవ్వాలి



సభ్యత్వ నమోదులో శ్రీనివాస్ రాథోడ్

**రామచంద్రాపురం(పటాన్‌చెరు)** : ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జేఎల్ ప్రమోషన్‌లు ఇవ్వాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో స్టేట్ టీచర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ప్రకాశ్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యత నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో తమ యూనియన్ ముందుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రతినిధులు పోచయ్య, మమత, రామారావు, సరియ, పుష్పలత, ఉషశ్రీ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కూచిపుడి నృత్యంలో జోగిపేట విద్యార్థిని ప్రతిభ

- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



అవార్డు అందుకుంటున్న స్నిద్ధశ్రీ

**జోగిపేట(అందోల్):** కూచిపూడి నృత్యంలో జోగిపేట పట్టణానికి చెందిన సాయి కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారి స్నిద్ధశ్రీకి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించినట్లు గురువారం పాఠశాల కరస్పాండెంట్ ఎన్.నాగరాజు తెలిపారు. సంస్థ భారత ప్రతినిధి బింగి నరేందర్ గౌడ్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడితో పాజి అనంత కిషన్, నాట్య గురువు జ్యోతి కులకర్ణి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకుంది. స్నిద్ధశ్రీ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించడంపై పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణ ప్రజలు అభినందనలు తెలియజేశారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీలు జరిగిన విషయం తెలిసిందే.

### పెండింగ్ డీఏలను చెల్లించాలి

**కొండాపూర్(సంగారెడ్డి):** పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించడంతోపాటు తక్షణమే పీఆర్‌సీ అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్కాపూర్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం టీపీటీఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి డీఈఓడీ, బీఈఓడీ వారితో ఉమ్మడిగా ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయడంతోపాటు పాతల పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలని కోరారు. తమ ఎన్నికకు సహకరించిన వారికి నూతన అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు రామచందర్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, ఎన్నికల అధికారి, అశోక్ కుమార్, పుండరికం, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

### మందుల కోసం వెళ్లి..

- వ్యక్తి అదృశ్యం

**చేగుంట(తూప్రాన్):** వ్యక్తి అదృశ్యమైన ఘటన చేగుంటలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. పట్టణానికి చెందిన షేక్ ఆసీఫ్ రైల్వే ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం నాంపల్లి రైల్వే ఆస్పత్రిలో మందులు తెచ్చుకునేందుకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. నాటి నుంచి అసిఫ్ ఇంటికి రాకపోగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం అసీఫ్ భార్య సిరీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# స్మార్ట్‌గా జహీరాబాద్


## ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీతో భారీగా విస్తరించనున్న పట్టణం

జహీరాబాద్ పట్టణ ప్రాంతానికి మహర్దశ రానుంది. ఈ ప్రాంతాన్ని కేంద్రం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ప్రకటించడంతో భారీగా విస్తరించనుంది. జహీరాబాద్ ప్రాంతానికి 2013లో జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్) ప్రాజెక్టు మంజూరైనా ఇప్పటి వరకు పురోగతి లేకుండా పోయింది. దశాబ్దం గడిచినా ఇంకా భూ సేకరణ అంశం కొలిక్కి రాలేదు. ఈ ప్రాజెక్టుపై దశాబ్ద కాలంగా జహీరాబాద్ ప్రాంత ప్రజలు ఎంతో ఆసక్తి పెంచుకొని ఎదురు చూస్తున్నారు. అయినా ప్రాజెక్టు విషయంలో పురోగతే లేకపోవడంతో ప్రజలు మర్చిపోయారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ప్రకటించడంతో ప్రజల్లో తిరిగి ఆశలు చిగురించాయి. - జహీరాబాద్





- 12,500 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు
- ఈ ప్రాంత ప్రజల్లో చిగురించిన ఆశలు
- పెరగనున్న ఉపాధి అవకాశాలు
- వ్యాపార రంగానికి మరింత ఊపు
- వ్యవసాయ రంగంపై ప్రభావం



జహీరాబాద్ పట్టణం, (ఇన్‌సెట్‌లో) ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు కోసం గుర్తించిన ప్రాంతం మ్యాప్

జహీరాబాద్ పట్టణం గృహ సముదాయం, వ్యాపార పరంగా ఇప్పటికే తూర్పు వైపున కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామం వరకు విస్తరించుకుంది. పడమర వైపు రాష్ట్ర సరిహద్దు వరకు విస్తరించింది. ఉత్తరం వైపు కర్ణాటకలోని బీదర్ నగరాన్ని కలుస్తూ విస్తరించుకుంది. దక్షిణం వైపున మొగుడంపల్లి మండలంతో కలిసి పోయింది. స్మార్ట్ సిటీ రావడంతో ప్రధాన నగరాలకు అనుగుణంగా రూపుదిద్దుకోనుంది. రూ.2,361 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం సైతం ప్రకటించింది. న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని 17 గ్రామాల పరిధిలో గుర్తించిన 12,500 ఎకరాల విస్తీర్ణంలో స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయనున్నారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం గుర్తించిన భూముల్లోనే స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది.

### కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఆశలు

స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో జహీరాబాద్ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురించాయి. నిమ్జ్‌పై ఆశలు వదులుకుంటున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రకటన ఊరటనిచ్చినట్లయింది. 2013 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జహీరాబాద్‌కు నిమ్జ్ ప్రాజెక్టును ప్రకటించింది. ఇందు కోసం 12,659 ఎకరాల భూమిని సేకరించాలని ప్రతిపాదించింది. మొదట్లో అసైన్‌మెంట్ భూములకు పరిహారం చెల్లించి సేకరించినా ఆ తర్వాత కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోవడంతో ప్రాజెక్టు అంశం పెండింగ్‌లో ఉండిపోయింది. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటు విషయంలో అంతగా ఆసక్తి చూపకపోవడం, నిధులు కేటాయించక పోవడంతో ఈ అంశం మరుగున పడింది. అధికారులు మాత్రం మొక్కుబడిగా భూ సేకరణ ప్రక్రియను కొనసాగించారు.

### వ్యాపార రంగానికి ఊపు

స్మార్ట్ సిటీ ఏర్పాటుతో జహీరాబాద్ ప్రాంతంలో వ్యాపార రంగానికి మరింత ఊపునిచ్చే అవకాశం ఉంది. వ్యాపారాలు మరింత విస్తరించనున్నాయి. ఇప్పటికే జహీరాబాద్ పట్టణం పెద్ద వ్యాపార కేంద్రంగా ఉంది. పట్టణం ఎటూ 10 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండడంతో వ్యాపారాలు మరింత విస్తరించనుంది.

### వ్యవసాయ రంగంపై ప్రభావం

ఈ ప్రాంతమంతా స్మార్ట్ సిటీగా విస్తరించనున్నందున ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇది రైతాంగానికి నిరాశకు గురి చేస్తోంది. వ్యవసాయ కూలీలు లభించక వ్యవసాయం కుంటుపడే అవకాశం ఉందని రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటికే వ్యవసాయ కూలీలు దొరకని పరిస్థితి ఉండటంతో చెరకు కోత, పత్తి తీసే పనులకు పక్క రాష్ట్రాల కూలీలపై ఆధార పడుతున్నారు. భవిష్యత్‌లో కూలీల సమస్య మరింత వేధించే అవకాశం ఉందని రైతాంగానికి బెంగ పట్టుకుంది.

### ప్రాజెక్టు ఏర్పాటు వేగిరం

కేంద్రం స్మార్ట్ సిటీ ఏర్పాటును ప్రకటించడంతో ప్రక్రియ వేగవంతం అయ్యే అవకాశం ఉంది. దేశంలో మొత్తం 12 ప్రపంచ స్థాయి గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటన్నింటితోపాటు జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ పనుల్లో వేగం ఉండే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అవసరం మేరకు నిధులు కేటాయింపులు జరిగే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రికల్, మెటల్, నాన్ మెటాలిక్, మెషినరీ పరిశ్రమలు స్మార్ట్ సిటీలో ఏర్పాటు కానున్నాయి.

### రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి



కేంద్ర ప్రభుత్వం జహీరాబాద్‌ను ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ప్రకటించడం సంతోషకరమైన విషయం. ఈ ప్రాజెక్టు వేగిరంగా పూర్తి చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరించాల్సిన అవసరం ఉంది. ప్రాజెక్టు ఏర్పాటుతో జహీరాబాద్ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరం ఉంటుంది. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆదాయం పెరిగి పట్టణం మరింత అభివృద్ధిని సాధించగలుగుతుంది.

- కె.మాణిక్‌రావు, ఎమ్మెల్యే, జహీరాబాద్

### నైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటు



నిరుద్యోగులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. న్యాక్ శిక్షణా కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైన మేరకు భూమిని కేటాయించేలా చూస్తాం. ఇదే భవనంలో సెట్విన్ నైపుణ్య శిక్షణా కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి స్మార్ట్‌సిటీలో ఉపాధి అవకాశాలు కల్పించేలా పాటుపడతాం.

- ఎస్.గిరిధర్‌రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్

### మెండుగా ఉపాధి అవకాశాలు

స్మార్ట్ సిటీ ఏర్పాటుతో యువత, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ప్రత్యేక్షంగా 1.74 లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉండగా పరోక్షంగా మరో లక్ష మంది ఉపాధి పొందనున్నారు. యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు వీలుగా నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



## వైద్య పరిశోధనలకు ఇదో చక్కటి వేదిక

- సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్
- ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 'మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ ప్రారంభం



రీసెర్చ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న విమలాథామస్, కిషోర్‌కుమార్, వైద్యాధికారులు

**సిద్దిపేటకమాన్:** అధ్యాపకులకు, విద్యార్థులకు వైద్య పరిశోధనలకు మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ చక్కటి వేదికగా ఉపయోగపడుతుందని తద్వారా వైద్య ఆరోగ్య రంగాలకు మేలు జరుగుతుందని ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్ అన్నారు. డీహెచ్‌ఆర్, ఐసీఎమ్‌ఆర్ ఢిల్లీ నిధులతో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్‌ను లోకల్ రీసెర్చ్ అడ్వైజరీ బోర్డు కమిటీ మెంబర్ డాక్టర్ అశ్విన్‌దలాల్, హైదరాబాద్ సీడీఎఫ్‌డీకి చెందిన సైంటిస్టులు డాక్టర్ కార్తీక్ భరద్వాజ్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిపుణుల బృందంతో కూడిన మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ ఎంఆర్‌యూ అధ్యాపకులు, వైద్య విద్యార్థులకు ఉపయోకరంగా ఉంటుందన్నారు. పరిశోధనలకు వేదికగా ఉపయోగపడుతుందన్నారు. దీంతో వైద్యారోగ్య రంగాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ రీసెర్చ్ సెంటర్‌ను హైదరాబాద్ తర్వాత సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలోనే ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఈ యూనిట్‌లో అనేక ప్రాజెక్టులు చేపడుతామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిమ్స్ డాక్టర్ నాగమణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ, డాక్టర్ చందర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని అన్ని విభాగాల వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వీపీఓ వ్యవస్థను మరింత బలపర్చాలి

సిద్దిపేట సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

**మిరుదొడ్డి(దుబ్బాక):** వీపీఓ (విలేజ్ పోలీస్ ఆఫీసర్) వ్యవస్థను బలపర్చడంతోపాటు ప్రతీ రోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ విధులను నిర్వహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డా.బి అనురాధ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ ఏరియాను, స్టేషన్ పరిధిలోని పార్టు 2 మ్యాపులను, మాల్ రూమ్ పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, వంటి మత్తు పదార్థాలపై నిఘా పటిష్టం చేయాలన్నారు. అమ్మేవారిపైనే కాకుండా వాటిని సేవించే వారిపై కూడా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. పాత నేరస్తులైన కేడీలు, డీసీలు, సస్పెక్ట్‌లను తరచుగా తనిఖీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ మధు, ఎస్ఐలు బోయిని పరశురాములు, కమలాకర్, ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్‌రెడ్డి, ఏఎస్ఐ శేఖర్, హెడ్ కానిస్టేబుళ్లు ప్రమోద్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌పీసీలే నేరుగా ధాన్యం కొనుగోళ్లు

నాబార్డు డీడీఎం కృష్ణతేజ





సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణతేజ

**జహీరాబాద్:** దళారుల వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల సంస్థ అయిన (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ) ఎఫ్‌పీసీలే రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాయని నాబార్డు డీడీఎం కృష్ణతేజ అన్నారు. గురువారం మండలంలోని దిడ్గి గ్రామంలో గల డీడీఎస్-కేవీకేలో నారింజ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఎఫ్‌పీసీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో మార్కెటింగ్ ఎలా చేయాలి, రైతుల వద్ద నుంచి ఎలా కొనుగోలు చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకునే వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా కృష్ణతేజ మాట్లాడుతూ.. దళారుల ప్రమేయం లేకుండా ఎఫ్‌పీసీలే ధర నిర్ణయించి రైతుల వద్ద కొనుగోళ్లు చేసి మార్కెట్‌లో విక్రయించాలన్నారు. ధాన్యం నాణ్యత ఎలా ఉండాలి, తేమ ఎంత మేర ఉండాలి, ఎలా నిర్వహించాలి అనే విషయాల గురించి నిరంతరం ఎఫ్‌పీసీలకు తెలియజేస్తామన్నారు. రైతుల వద్ద నుంచి ఉత్పత్తి అవుతున్న కంది, సోయాబీన్, మొక్కజొన్నను ఎఫ్‌పీసీల ద్వారా కొనుగోళ్లు చేయాలన్నారు. సమావేశంలో ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 50 ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రైతులు, ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, మార్కెటింగ్ కార్యదర్శి అనిల్‌బాబు, ఉద్యాన అధికారి పండరి, కర్ణాటక ఏడీఎం కంపెనీ ప్రతినిధులు ఉల్వప్ప, మంజూనాథ్, కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, శైలజ నారింజ రైతు మిత్ర సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుప్రసిత రెడ్డి, అర్చనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేతల అరెస్టు

- పోలీసుల అదుపులో ఏడుగురు




వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** గంజాయి విక్రయిస్తున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో కలిసి బుధవారం జగదేవ్‌పూర్ గ్రామ సమీపంలో కాల్వ వద్ద పెట్రోలింగ్ చేస్తున్నారు. మునిగడప గ్రామానికి చెందిన పల్లెపాటి వెంకటేశ్ ద్విచక్ర వాహనం తనిఖీ చేయగా కేజీ 300 గ్రాముల గంజాయి లభించింది. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా మరో యువకుడు జశ్వంత్ వద్ద కేజీ గంజాయి లభ్యమైంది. ఇతడు చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అరవింద్ ,ప్రేమ్‌రాజు వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకోగా వారిని అరెస్ట్ చేశారు. అలాగే, బాలకిషన్, సంపత్ అనే ఇద్దరు యువకులు గంజాయి తాగుతూ పోలీసులకు కనిపించగా వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని బాలాజీ నగర్‌కు చెందిన కోహెడ వెంకటేశ్, మునిగడపకు చెందిన వెంకటేశ్ ఇద్దరూ కలిసి భద్రాచలం నుంచి గంజాయి తీసుకొచ్చి పోతిరెడ్డిపల్లి, చేర్యాల, జగదేవ్‌పూర్ గ్రామాల్లో యువకులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు ఏడుగురు యువకుల నుంచి మూడు కేజీల 320 గ్రాముల గంజాయి, నాలుగు బైక్‌లు, 2 వేల నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐ రమణరెడ్డి, పోలీస్ సిబ్బంది జనార్దన్, లింగం, తాజోద్దీన్, శశికాంత్ పాల్గొన్నారు.

### బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు

**జహీరాబాద్ టౌన్:** బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు మెజిస్ట్రేట్ జయంతి గురువారం జీవిత ఖైదు విధించినట్లు జహీరాబాద్ డీఎస్పీ రామోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్‌కు చెందిన ఓ మూగ బాలిక ఒంటరిగా ఉన్నప్పుడు అదే గ్రామానికి చెందిన మహ్మద్ జబ్బార్(19) 2018లో అత్యాచార్యం చేశాడు. అప్పట్లో ఆమె తండ్రి చిరాగ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ గణేశ్ కేసు నమోదు చేసి నేరస్తుడిని కోర్టులో రిమాండ్ చేశారు. కేసు పూర్వపరాలను విన్న స్పెషల్ పోక్సో కోర్టు మెజిస్ట్రేట్ జయంతి నిందితుడు జబ్బార్‌కు జీవిత ఖైదు, రూ.20 వేల జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకుంటే ఏడాది సాధారణ జైలు శిక్ష ఉంటుందన్నారు.

### భెల్ కార్మికుడు ఆత్మహత్య



అర్జున్‌రావు(ఫైల్)

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** భెల్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. బీహెచ్ఈఎల్ పరిశ్రమలో కార్మికుడైన సత్యహనుమా అర్జున్ రావు(39) తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని భెల్ సైబర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. 2015లో వివాహం కాగా రెండేళ్లకు దంపతుల మధ్య గొడవలు జరగడంతో విడాకులు తీసుకున్నారు. రెండేళ్ల కిందట తల్లి కూడా మృతి చెందింది. అప్పటి నుంచి డిప్రెషన్‌లోకి వెళ్లాడు. గురువారం అర్జున్‌రావు ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆదాయ పన్నులపై అవగాహన

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** బీహెచ్ఈఎల్ పరిశ్రమలో టీడీఎస్, టీసీఎస్‌లపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆదాయ పన్ను శాఖ కమిషనర్ (టీడీఎస్) కొక్కిటిగడ్డ జగ్జీవన్ రావు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బెల్ ఈడీ (పీఎంజీ అండ్ పీఈఎస్‌డీ) శ్రీనివాస్ రావు, ఈడీ కేబీ రాజా, జీఎం మాలతి, ఏజీఎం అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో జగ్జీవన్‌రావు

# జాతీయ స్థాయిలో రాణించడం శుభసూచికం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): క్రీడాకారులతో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయిలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం శుభసూచికమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో రాణించిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. అదే విధంగా ఈ పాఠశాలలో చదివి, పీఈటీ ట్రెయినింగ్‌లో సీటు సాధించిన విద్యార్థినులను సన్మానించారు. పాఠశాలకు సౌండ్ సిస్టమ్, మినీవాటర్ ట్యాంక్, 100 మంది విద్యార్థినులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మల్లారెడ్డి, ఉదయశ్రీ, ప్రభు, బాల సరస్వతీ, అశోక్‌రెడ్డి, పద్మావతి, శ్రీనివాస్‌గౌడ్, సుజాత, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



సంగారెడ్డి: క్రీడా జ్యోతి వెలిగిస్తున్న అధికారులు

### జిల్లా స్థాయి హాకీ పోటీలు ప్రారంభం

**సంగారెడ్డి:** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో హాకీ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో డీఈఓ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ ఖాసీం బేగ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీష్ ప్రారంభించారు. హాకీ పోటీల్లో విజేతగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, గౌస్, శ్రీకాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# దారి దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు

**పటాన్‌చెరు టౌన్:** దారి దోపిడీకి పాల్పడుతున్న దొంగల ముఠాకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలు, జరిమానా విధించింది. పోలీసుల కథనం మేరకు.. 2016 మార్చి 5న అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడా హెచ్‌పీ గ్యాస్ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి రోజు మాదిరిగానే పటేల్‌గూడ గ్యాస్ గోదాంకు సంబంధించి రూ.6.28 లక్షలు తీసుకొని పటాన్‌చెరు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జమ చేసేందుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో పటాన్‌చెరు డివిజన్ సమీపంలో కోళ్ల ఫారమ్ వద్దకు రాగానే కారులో కొందరు వ్యక్తులు వచ్చి బైక్‌ను ఆపి విష్ణువర్ధన్ కళ్లలో కారం కొట్టి డబ్బులు తీసుకొని పరారయ్యారు. బాధితుడు అప్పట్లో పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ లింగేశ్వర్‌రావు కేసు నమోదు దర్యాప్తు చేపట్టి అప్పట్లోనే నిందితులను పట్టుకున్నారు. కేసు విచారణలో భాగంగా దారి దోపిడీకి పాల్పడిన ఐడీఏ బొల్లారానికి చెందిన రామారావు, దేవేందర్ రావు, ఫిరోజ్, సంతోష్, మోహన్, సంజయ్ కుమార్, గణేశ్ అలియాస్ శ్రీనివాస్ రావును గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి రాధా కృష్ణ చౌహాన్ కేసు పూర్వపరాలను పరిశీలించి నిందితులకు ఏడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు అప్పటి సీఐ లింగేశ్వర్‌రావు, ప్రస్తుత పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి, పీపీ నిర్మల, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ కిషన్ సింగ్, ధనుంజయ, రాజశేఖర్, కోర్ట్ లైజనింగ్ అధికారి సత్యనారాయణ ఎస్ఐలను ఎస్పీ అభినందించారు.

# పత్తి పంట ధ్వంసం

**పెద్దశంకరంపేట(మెదక్):** మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామశివారులో మన్నె క్రిష్ణకు చెందిన పత్తి పంటను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. గురువారం ఉదయం పంట పొలానికి వెళ్లగా పంట ధ్వంసమై కనిపించింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శంకర్‌కు ఫిర్యాదు చేశాడు.



ధ్వంసమైన పత్తి చేను